

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువత యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | శుక్రవారం 29, మే 2026 | సంపుటి :16 సంచిక :61 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



2 లో..

బీజేపీ కీలక నిర్ణయం..

## నాలుగు రాష్ట్రాలకు అధ్యక్షుల ప్రకటన..

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు నేడు (గురువారం) పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది.



2

## సీబీఎస్ఈ మూల్యాంకనంలో తప్పులు దొర్లాయి: విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



## దేశవ్యాప్తంగా ముగిసిన బక్రీద్ ప్రార్థనలు..

### మత సామరస్యాన్ని చాటిన వేడుకలు

త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) పండుగను దేశవ్యాప్తంగా ముస్లింలు ఇవాళ (గురువారం) అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుంటున్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గాలకు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు. దేశంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు, స్థానిక యంత్రాంగాలు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయి.

వార్త 2లో

## సీఎం పదవికి సిద్దరామయ్య
# రాజీనామా



- తన నివాసంలో సిద్దరామయ్య అల్పాహార విందు
- విందులో ఉప ముఖ్యమంత్రి డీకేతో పాటు మంత్రులు
- కేబినెట్‌ను రద్దు చేస్తున్నట్టు వెల్లడి
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాళ్లు మొక్కిన డికె
- గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సిద్దరామయ్య
- జాతీయ రాజకీయాల్లోకి రావాలని సూచించిన రాహుల్
- జాతీయ రాజకీయాల్లోకి రాలేనని చెప్పిన సిద్దరామయ్య



కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గురువారం ఉద యం మంత్రులకు తన నివాసంలో సిద్దరామయ్య అల్పాహార విందు ఇచ్చారు. ఈ విందులో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన రాజీనామా విషయంలో హైకమాండ్ నిర్ణ యాన్ని సహచర మంత్రులకు సిద్దరామయ్య చెప్పారు. కర్ణాటక సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కేబినెట్‌ను రద్దు చేస్తున్నట్టు వెల్లడిం చారు. అల్పాహార విందు సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. ముఖ్య మంత్రి సిద్దరామయ్య కాళ్లు మొక్కారు. తర్వాత ఆయనను ఆత్మీయ ఆలి ంగనం చేసుకున్నారు.

వార్త 2లో



## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు

- తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి
- జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయి
- హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం..
- ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర
- మంత్రి వివేక్ వెంకటస్వామి

2



తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళుచేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు.



2

## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి కోమటిరెడ్డి

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు.

## పేదల ఇండ్లపై బుల్డోజర్‌తో
# కూలగొడుతున్న క్రూరులు

హైదరాబాద్:

ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ బిఆర్ఎస్ ది అని కెటిఆర్ తెలిపారు. సవాళ్లు చేయడం.. పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటు అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశామని, డబ్బా ఇండ్లు కాదని..డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించామని తెలియజేశారు. 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని.. ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? అని ప్రశ్నించారు. శపథం చేయడం కాదని..చేతనైతే చేసి చూపించండి అని అన్నారు. హైదరాబాద్ లో లక్ష డబుల్ బెడ్



రూం ఇండ్లు నిర్మించిన ఘనత బిఆర్ఎస్ ది అని తాము కట్టిన ఒక్కో ఇల్లు 7 ఇందిరమ్మ ఇండ్ల తో సమానం అని కొనియాడారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే అంతకు మించి డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టండి అని గృహ నిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం తాము అని కెటిఆర్ పేర్కొన్నారు. గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు కాంగ్రెస్ అని విమర్శించారు. ఇటుకలు పేర్చి ఇండ్లు కట్టింది తాము అని పేదల ఇండ్లపై బుల్డోజర్ ఎక్కించి కూలగొడుతున్న క్రూరులు కాంగ్రెస్ వారు అని మండిపడ్డారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇండ్లు.. పడగొట్టిన ఇండ్లపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. తమకు తెలుసు ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడం తెలుసు అని ఆత్మాభిమానంతో బతకడం తెలుసు అని కెటిఆర్ అన్నారు. ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు తమకు తెల్వదని, బ్లాక్ మెయిల్ దందాలు చేసి దండుకునే లాండ్ గేమ్స్ తెల్వదని అన్నారు.



## రైతన్నల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం: మహేశ్వర్ రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. ఈరోజు (గురువారం) కడెం మండలంలో 'రైతు గోస- బీజేపీ భరోసా యాత్ర' నిర్వహించారు. పెద్దూర్‌తండాలో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పరిశీలించారు.

# బీజేపీ కీలక నిర్ణయం.. నాలుగు రాష్ట్రాలకు అధ్యక్షుల ప్రకటన..

ఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు నేడు (గురువారం) పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది.

# దేశవ్యాప్తంగా ముగిసిన బక్రీద్ ప్రార్థనలు..

## మత సామరస్యాన్ని చాటిన వేడుకలు

న్యూఢిల్లీ,

త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) పండుగను దేశవ్యాప్తంగా ముస్లింలు ఇవాళ (గురువారం) అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుంటున్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గాలకు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు. దేశంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు, స్థానిక యంత్రాంగాలు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయి. ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత -- సోదరభావం చాటిన భక్తులుఢిల్లీలోని చరిత్రాత్మక జామా మసీదు, ఫతేపురి మసీదులతో పాటు ప్రధాన ఈద్గాల వద్ద వేలాది మంది నమాజ్ చేశారు. ప్రార్థనల అనంతరం భక్తులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఢిల్లీ జాయింట్ పోలీస్ కమిషనర్ మధుర్ వర్మ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ.. ఇప్పటివరకు పండుగ వేడుకలు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా అత్యంత ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

### ఉత్తరప్రదేశ్‌లో గంగా-జమునా తెహజీబ్

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో హిందూ-ముస్లింల మధ్య ఉన్న శతాబ్దాల నాటి మత సామరస్యం మరోసారి కనిపించింది. ఇక్కడి ఒక స్థానిక దేవాలయం, ఈద్గా ఒకే ఉమ్మడి గోడను పంచుకుంటున్నాయి. ఆలయ నిర్వాహకుడు ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. 'తరతరాలుగా ఇక్కడ హిందూ, ముస్లింలు ఎంతో సామరస్యంగా జీవిస్తున్నారు. ఒకవైపు ఆలయంలో పూజలు, మరోవైపు ఈద్గాలో నమాజ్ ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా జరుగుతాయి' అని పేర్కొన్నారు.

### రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు

రాజస్థాన్: అజ్మీర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గాలో ఈ తెల్లవారుజామున 'జన్నతీ దర్వాజా'ను తెరిచారు. ఈ ప్రత్యేక సందర్భంలో ప్రార్థనలు చేయడానికి దేశం నలుమూలల నుంచి రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చారు.పశ్చిమ బెంగాల్: చందన్‌నగర్



పోలీస్ కమిషనర్ సునీల్ కుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో ప్రశాంతత కోసం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ , ఎమర్జెన్సీ ఫస్ట్ రెస్పాన్స్ బృందాలతో పాటు 12 కంపెనీల సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ బలగాలను మోహరించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో కాకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే ఖుర్బానీలు నిర్వహించేలా, మాంసం పంపిణీ చేసేలా



కమ్యూనిటీ నాయకులతో 22 సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఏపీలోని విజయవాడ, కర్నూలు, గుంటూరు, కడప వంటి ప్రధాన నగరాల్లోని ఈద్గాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మత గురువులు (ఇమామ్‌లు) ప్రత్యేక ప్రార్థనలు చేయించి, పండుగ విశిష్టతను, ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక దువా చేశారు. పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో మత సామరస్యం ఉట్టిపడింది. ముస్లిం సోదరులకు హిందూ బంధువులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నమాజ్ పూర్తయిన తర్వాత ముస్లింలు తమ ఇళ్లలో సాంప్రదాయబద్ధంగా 'ఖుర్బానీ' (బలి) ఇచ్చి, ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి బంధువులకు, మిత్రులకు, పేదలకు పంపిణీ చేశారు.



# సీఎం పదవికి సిద్దరామయ్య రాజీనామా

**తన నివాసంలో సిద్దరామయ్య అల్పాహార విందు**

**విందులో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు మంత్రులు**

**కేబినెట్‌ను రద్దు చేస్తున్నట్టు వెల్లడి**

**ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాళ్లు మొక్కిన డికె**

**గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సిద్దరామయ్య**

**జాతీయ రాజకీయాల్లోకి రావాలని సూచించిన రాహుల్**

**జాతీయ రాజకీయాల్లోకి రాలేనని చెప్పిన సిద్దరామయ్య**

ఇంటర్‌నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గురువారం ఉద యం



మంత్రులకు తన నివాసంలో సిద్దరామయ్య అల్పాహార విందు ఇచ్చారు. ఈ విందులో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన రాజీనామా విషయంలో హైకమాండ్ నిర్ణ యాన్ని సహచర మంత్రులకు సిద్దరామయ్య చెప్పారు. కర్ణాటక సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కేబినెట్‌ను రద్దు చేస్తున్నట్టు వెల్లడిం చారు. అల్పాహార విందు సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాళ్లు మొక్కారు. తర్వాత ఆయనను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. కాగా, సిద్దరామయ్య రాజీనామా లేఖను సమర్పించటం కోసం ఇప్పటికే గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. ఈ రోజు ఉదయం ఆయన తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పించడానికి సిద్ధమయ్యారు. అయితే, గవర్నర్ అందుబాటులో లేరు. నిన్న రాత్రి 10:30 గంటలకు ఆయన ముంబై వెళ్లారు. మధ్యాహ్నం బెంగళూరుకు రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సిద్దరామయ్య గవర్నర్‌కు రాజీనామా లేఖ సమర్పించనున్నారు.

### సిద్దరామయ్యకు రాజ్యసభ?

సిద్దరామయ్యను రాజీనామా చేయాలని కోరిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆయనకు పలు ఆఫర్లను ఇచ్చినట్లు తెలుస్తోంది. రాజ్యసభ టికెట్ ఇస్తామని, జాతీయ రాజకీయాల్లోకి రావాలని సూచించినట్లు సమాచారం. అంతేకాదు.. సిద్దరామయ్య కుమారుడు యతీంద్రకు క్యాబినెట్‌లో చోటు కల్పిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. తాను జాతీయ రాజకీయాల్లోకి రాలేనని, హిందీ సమస్య కానుందని రాహుల్‌తో సిద్దరామయ్య అన్నారట. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఉత్కంఠ రేపుతోంది.

# సీబీఎస్ఈ మూల్యాంకనంలో తప్పులు దొర్లాయి:

## విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

సీబీఎస్ఈ ఫలితాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. సీబీఎస్ఈ మూల్యాంకనంలో తప్పులు దొర్లినట్టు అంగీకరించారు. ఆ తప్పులకు తానే బాధ్యత వహిస్తున్నానని ధర్మేంద్ర ప్రకటించారు. సీబీఎస్ఈ 12వ తరగతి పత్రాల రీ-వాల్యుయేషన్‌కు ఆదేశించారు. విద్యార్థులెవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఓఎస్ఎమ్ విధానంలో లోపాలున్నాయని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

### ఇంతకీ ఏం జరిగిందంటే..

సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు, రీవాల్యుయేషన్ ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ఏడాది సీబీఎస్ఈ ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. పరీక్షలు రాసిన 17లక్షల మంది విద్యార్థుల్లో ఏకంగా 4,04,319 మంది తమకు సంబంధించిన జవాబు పత్రాల స్కాన్ కాపీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జవాబు పత్రాల స్కాన్ కాపీల్లో చాలా వరకు పత్రాలు అస్పష్టంగా (బ్లర్) కనిపిస్తుండగా.. మరి కొంతమంది విద్యార్థులకు ఏకంగా వేరొకరి జవాబు పత్రాలు దర్శనమిస్తున్నాయి.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు

**తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి**

**జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయి**

**హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం..**

**ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర**

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

మంచిర్యాల, న్యూస్‌వార్ ప్రతినిధి



తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళు చేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

### హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం..

పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

### ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర: మంత్రి అడ్లూరి

ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు.బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు.

# ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ, న్యూస్‌వార్ ప్రతినిధి

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# రైతన్నల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం: మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా, న్యూస్‌వార్ ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. ఈరోజు (గురువారం) కడెం మండలంలో 'రైతు గోస- బీజేపీ భరోసా యాత్ర' నిర్వహించారు. పెద్దూర్‌తండాలో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్ పరిశీలించారు.

### ధాన్యం కుప్పలు కనపడట్లేదా..?

ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. పంటలను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. 80శాతం ధాన్యం కొనుగోలు చేశామని చెప్పు కుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు కనపడట్లేదా..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పటికైనా ధాన్యం తరలింపు పనులను వేగవంతం చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

### 40శాతం ధాన్యం కూడా కొనలేదు..

పంటలు పండించడం ఒక ఎత్తయితే... ఆ పంటలను అమ్ముకోవడం మరో టాస్క్‌గా మారిందని అన్నారు. నెలరోజులైనా 40శాతం ధాన్యం కూడా కొనలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. వర్షం భయంతో పంట కల్లాల వద్ద రైతులు పడికాపులు కాస్తున్నారని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయినా ఏ మంత్రి కూడా ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సైతం ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. తడిసిన ధాన్యాన్ని సైతం ఎలాంటి తరుగు, కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.



న్యూస్ వార్ వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# మండుటెండలపై దీర్ఘకాలిక యుద్ధం

**రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు కూడా పగులుతాయని ప్రతీతి. గత నాలుగైదు దశాబ్దాలుగా రోహిణి కార్తె రాకముందే ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఎడారి ప్రాంతాలుగా పేరుపడిన గల్ఫ్ దేశాల్లో ఒకప్పుడు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటితే ముక్కున వేలేసుకునేవాళ్లం. ఇప్పుడు భారతదేశంలోనే ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతున్న దుస్థితి దాపురించింది. ప్రస్తుత ఎండాకాలంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ లోని కంకిపాడు, పెనమలూరు, పిడుగురాళ్ల వంటి చోట్ల ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలకు చేరుకోవడం చూస్తున్నాం. తెలంగాణలోను పలు ప్రాంతాల్లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గోరుచుట్టుపై రోకటిపోటులా.. ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నగరాలలో 50 వరకూ భారతదేశంలోనే ఉన్నట్లు వాతావరణ అధ్యయన సంస్థ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఇటీవల పేర్కొనడం మరింత ఆందోళన కలిగించే విషయం.**

ఈ యాభై నగరాల్లో సగం వరకూ ఉత్తరప్రదేశ్‌కు చెందినవే కాగా, తెలుగు రాష్ట్రాల్లోని ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, జగిత్యాల, భీమవరం వంటి పట్టణాలు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. గత వారం ఒక్కరోజులో నమోదైన ఉష్ణోగ్రతల ఆధారంగానే ఈ నివేదిక వెలువడినా, పరిస్థితి గంభీరంగా ఉందనే విషయాన్ని ఈ నివేదిక నొక్కి చెబుతోందన్న విషయాన్ని విస్మరించకూడదు. మార్చి- మే నెలల మధ్య ఎండల వేడి అధికంగా ఉండటం సహజమే అయినా, ఈ ఏడాది వేసవి వచ్చీరావడంతోనే ప్రతాపం చూపించడం మొదలుపెట్టింది. మార్చి రెండోవారంలోనే కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదు కావడం వాతావరణంలో ఏర్పడుతున్న పెనుమార్పులకు నిదర్శనం. మరోవైపు వడగాడ్పులు సైతం ప్రజలను మాడ్చిమసిచేస్తున్నాయి. రోజుకు పదుల సంఖ్య లో జనం మండుటెండలకు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండల ప్రభావం ప్రజలకు ఆరోగ్య సమస్యలను తెచ్చిపెట్టడమే కాదు, ఆర్థిక వ్యవస్థతోపాటు వ్యవసాయ, నీటిపారుదల వంటి పలు రంగాలపైనా పెనుప్రభావం చూపిస్తుంది. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లభించక, లభించినా మండుటెండల్లో పనిచేయలేక అల్లాడుతున్నారు. ఎండల వేడిమి కారణంగా కార్మికులు ఉపాధి కోల్పోవడం, వ్యవసాయం, మైనింగ్, భవన నిర్మాణ రంగాలు కుదేలు కావడం వంటి కారణాల రీత్యా 2030 నాటికి భారత జిడిపిలో 4.5 శాతం నష్టపోవచ్చునని ప్రపంచ బ్యాంకు అంచనా. అంతకంతకూ పెచ్చుమీరుతున్న మండుటెండల ప్రభావం కాలానుగుణమైనదేనని సరిపెట్టుకుంటే అంతకంటే అమాయకత్వం మరొకటి ఉండదు. ఇంతటి విపత్కర పరిస్థితులకు కారణం వాతావరణ మార్పులేనన్నది సుస్పష్టం. అడవుల నరికివేత, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారం, పట్టణీకరణ వంటివి భూమధ్య రేఖకు సమీపాన ఉన్న భారతదేశాన్ని పెనంమీదనుంచి పొయ్యిలో పడేలా చేస్తున్నాయి. వీటి కారణంగా ఎండలు, వడగాడ్పుల ప్రభావం అంతకంతకూ అధికమవుతున్నాయని నాలుగు దశాబ్దాలుగా వాతావరణ శాస్త్రవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నా పట్టించుకునేవారు కరవవుతున్నారు. చలివేంద్రాలు పెట్టించి, వడదెబ్బ తగిలితే ఆస్పత్రిలో చికిత్స చేయించి పంపించడంతో ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయి. వడదెబ్బ మృతులకు పరిహారం అందించేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తున్న పాలకులు మండుటెండల ప్రభావాన్ని అరికట్టేందుకు దీర్ఘకాలిక ప్రణాళికల రూపకల్పన అత్యవసరమనే విషయాన్ని విస్మరిస్తున్నారు. వడదెబ్బకు బలవుతున్నవారిలో అధిక సంఖ్యాకులు నిరుపేదలే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవిలో జనావాసాలతో కిటకిటలాడే ప్రాంతాల్లోనూ, మురికివాడల్లోనూ వాతావరణాన్ని చల్లబరిచే ప్రక్రియలను అమలు చేయాలి. ఇళ్ల పైకప్పులకు గ్రీన్ రూఫ్ లతోపాటు తక్కువ వేడిని గ్రహించే సామగ్రిని వినియోగించడం తప్పనిసరి చేస్తూ నిబంధనల రూపకల్పన జరగాలి. జంగిల్ లా మారుతున్న పట్టణాలు, నగరాల్లో బహిరంగ స్థలాలను, పార్కులను విస్తరించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే, హరితవనాలను పెంపొందించడం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించే దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం మరొక ఎత్తు. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని తగ్గించి, సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలి. ప్రస్తుత వేసవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలను



గుణపాఠంగా తీసుకుని, ఏటా వేసవి రాకముందే ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలి. వేసవి ఒకప్పుడు సహజ రుతు లక్షణమేమో గానీ, ఇప్పుడు కాదు. రుతువులన్నీ కలగాపులగమై, ఎండాకాలంలో జడివానలు, వర్షాకాలంలో మండుటెండలనూ చవిచూస్తున్న రోజులివి. కాబట్టి, ఆయా కాలాల్లో తలెత్తే ప్రకృతి వైపరీత్యాలను దీటుగా ఎదుర్కొనేందుకు బడ్జెట్లో ప్రత్యేకంగా కేటాయింపులు జరపడం అత్యవసరం.

# సంస్కరణలకు,విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది

**టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే**

**పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం**

**దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి**

**మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం**

**45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం**

**మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత**

**ఈ మహానాడు మహిళలకు అంకితం ఇస్తున్నాం**

**23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు**

**మహానాడు మోడల్ మారింది తప్పు..విధానం మారలే**

**వైసిపి హయాంలో అణచివేతలను ఎదుర్కొని నిలబడ్డాం**

**మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు**

**అమరావతి,**

విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్‌ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయనమాట్లాడారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరినీచిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు. కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళల వంటింటి కష్టాలు తగ్గేందుకు నాడు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చాం. నేడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు




ఉచితంగా ఇస్తున్నాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించాం. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నాం. సోషల్ సైకోల తాటతీసి. మహిళల గౌరవాన్ని కాపాడుతాం. నాడు ఒక్క ఐటీనే.. యువత తల రాత మార్చింది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయి. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఎంవోయూలన్నీ పూర్తయితే ఇది సాధ్యమే. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాం. ఇప్పుడు గేర్ మార్చాం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నాం. ఏ ప్రాజెక్టు వచ్చినా మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. 288 ప్రాజెక్టులు ప్రారంభించే రోజు కూడా నిర్ణయించేశాం అని సీఎం తెలిపారు. వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్పు.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచిందని అంటూ వివరించారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

**పార్టీ జెండా అవిష్కరించిన సిఎం చంద్రబాబు**

**పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి**

**హాజరైన పార్టీ ప్రముఖులు, పొలిట్ బ్యూరో సభ్యులు**

**అమరావతి**

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు–2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷ులినీ–చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు–2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.



# ఇడి దాడులపై భగ్గుమన్న సిపిఎం

**కేరళలో పలు చోట్ల ఆందోళనలు**

**బిజెపితో కాంగ్రెస్ చేతులు కలిపిందన్న నేతలు**

**తిరువనంతపురం,**

కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళం శాసనసభ ప్రతిపక్ష నాయకుడైన పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను సిపిఎం ఖండించింది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను నిరంతరం ఉపయోగించడంలో ఇది ఒక భాగమని సిపిఎం అభివర్ణించింది. సిపిఎం, ఇతర ప్రతిపక్ష శక్తులపై జరుగుతున్న విస్తృత రాజకీయ వేధింపులు, వ్యక్తిత్వ హననంలో ఈ దాడులు ఒక భాగమని సిపిఎం పేర్కొంది. ఈ చర్య కేరళ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడిని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఖండించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో 'ఇలాంటి చర్యలు పినరయి విజయన్‌ను గానీ, సిపిఎంను గానీ భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో యూడీఎఫ్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ÷ఖనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ జరిపిన దాడిని రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి, లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను పద్ధతి ప్రకారం దుర్వినియోగం చేయడానికి ఇది మరో ఉదాహరణ. ఇటువంటి కక్షపూరిత చర్యలు నిరంకుశ మనస్తత్వాన్ని బయటపెడతాయి. ఈ అప్రజాస్వామిక ఎత్తుగడలకు పినరయి, సిపిఎం బెదరబోవు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల మద్దతుతో సిపిఎం దృఢంగా పోరాడుతుంది. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో చేసినట్లే, ఆయనను లక్ష్యంగా చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ఈడీని చురుకుగా ప్రోత్సహించిందన్నది స్పష్టం' అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను ఉపయోగించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలిపిందని సిపిఎం పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాన్ని కేరళ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఈ చర్యను ప్రతిఘటించాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, కేరళ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి, ప్రజాస్వామ్య నిరసనలు, సామూహిక కార్యాచరణ ద్వారా ఈ రాజకీయ దాడులను ఎదుర్కొం టామని సిపిఎం పేర్కొంది. ఈడీ నిర్వహిస్తున్న సోదాలకు వ్యతిరేకంగా కేరళతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆగ్రహిస్తూ పార్టీ శ్రేణులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు. కన్నూర్‌లోని పినరయి విజయన్ కుటుంబ నివాసం, తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న ఆయన అ÷–దదె ఇంటి ముందు సిపిఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టారు. తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలో సిపిఎం కేరళం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిదన్, వి.శివన్‌కుట్టి, జాన్ బ్రిట్టాస్, వి. జాయ్, అనవూర్ నాగప్పన్, వి.కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కన్నూర్‌లో జరిగిన నిరసనలో ఎం.వి. జయరాజన్, పి. జయరాజన్, కె.కె. రాజేష్, కె.కె. శైలజ తదితరులు పాల్గొన్నారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ మాట్లాడుతూ? ఈడీ సోదాలు పార్టీపై, పినరయి విజయన్‌పై జరిగిన 'హేయమైన రాజకీయ దాడి'గా పేర్కొన్నారు. ఈ చర్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తెలిపారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

## చౌటుప్పలలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**చౌటుప్పల మే 28 (న్యూస్ వార్ )**

చౌటుప్పల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 103 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల మున్సిపల్ అధ్యక్షులు జంగయ్య గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ తన పదవీకాలంలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి అట్టడుగు వర్గాల వారు రాజకీయాల్లో ముందుకు వచ్చేలా ప్రోత్సహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్, రామిరెడ్డి, తడక కోటేష్, గోవిందా చారి, వెంకటేశం, అంతటి కిష్టయ్య, అంజయ్య, లక్కారం జంగయ్య గౌడ్, బొంగు బాదుషా,చెరుకు అశోక్ గౌడ్, సింగిరెడ్డి సురేందర్ రెడ్డి, నరసింహ గౌడ్, పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మనోవికాసాన్ని పెంపొందిస్తాయి



**సంస్థాన్ నారాయణపురం మే 28 (న్యూస్ వార్ )**

అల్లం దేవి చెరువు గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, బిజెపి మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ గ్రామంలోని యువకులు, చిన్నారులు క్రీడల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షిస్తూ వారికి క్రికెట్ బ్యాట్లను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలు కూడా పిల్లల భవిష్యత్తుకు ఎంతో అవసరమని, క్రీడాస్ఫూర్తి ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత పట్టుదలతో కృషి చేసి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## గుజరాత్ లో ఎబోలా అలర్ట్:

### వైరస్ సోకినట్లు అనుమానం..

### నలుగురిని క్వారంటైన్ కు తరలింపు

ఉగాండా,కాంగో వంటి ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ప్రాణాంతక వైరస్ ఎబోలా ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యాపిస్తుండటంతో భారత్ అప్రమత్తమైంది.ముందస్తు చర్యల్లో భాగంగా ఢిల్లీ, ముంబై, గుజరాత్ ఎయిర్ పోర్టులలో హైఅలర్ట్ ప్రకటించారు. కాంగో,ఉగాండా వంటి దేశాలనుంచి వచ్చిన వారికి స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నారు. ఇటీవల ఆఫ్రికానుంచి గుజరాత్ కు వచ్చిన ఓ వ్యాపారవేత్త తోపాటు నలుగురిని క్వారంటైన్ కు పంపించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించారు.అమోరి లోకోలాగా అనే 37 ఏళ్ల ఆఫ్రికన్ వ్యాపారవేత్త, కొద్ది రోజుల క్రితం ముంబైకిచేరుకుని అక్కడి నుంచి వడోదరకు వచ్చినట్లు గుర్తించారు. వడోదరలో ఆయనకు జ్వరం రావడంతో ముందుగా బ్యాంకర్ ఆసుపత్రిలో చేర్చారు. ఆ తర్వాత ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు, అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలోని ప్రత్యేక ఎబోలా ఐసోలేషన్ వార్డుకు తరలించారు. వ్యాపారవేత్తతోపాటు ప్రయాణించిన పాట్రిక్ కాజా, వాలెంటిన్ జోడెల్ అనే మరో ఇద్దరిని, అలాగే వారితో సన్నిహితంగా ఉన్న డాక్టర్ సునీల్ ముసానాను కూడా అహ్మదాబాద్లోని ఎస్విపి ఆస్పత్రిలో వేర్వేరుగా క్వారంటైన్ చేశారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ




చర్యలు తీసుకుంటున్నామని గుజరాత్ ఆరోగ్యమంత్రి తెలిపారు. అనుమానితులను 10 నుంచి 11 రోజుల పాటు క్వారంటైన్లో ఉంచుతామని, వారి బ్లడ్ శాంపిల్స్ టెస్టులకోసం పుణెలోని ల్యాబ్కు పంపామని తెలిపారు.ఇప్పటి వరకు గుజరాత్లో గానీ,భారతదేశంలో గానీ ఒక్క ఎబోలా కేసు కూడా నిర్ధారణ కాలేదు. ప్రస్తుతం క్వారంటైన్లో ఉన్న రోగుల పరిస్థితి నిలకడగా ఉంది. వారి శరీర ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంది. పుణె ల్యాబ్ నుంచి రిపోర్టులు వచ్చాకే పూర్తి వివరాలు తెలుస్తాయి. ఇది కేవలం ముందుజాగ్రత్తగా తీసుకున్న చర్య మాత్రమే కాబట్టి ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పనేరియా స్పష్టం చేశారు.

# మునుగోడు ఎమ్మెల్యే హామీ నేతి బీరకాయలో నెయ్యి

### రెండిటికీ తేడా లేదన్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**మే 28 ( న్యూస్ వార్ )**

మాజీ ఎమ్మెల్యే శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చండూరు పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజా సమస్యలు తీర్చడంలో స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు ముఖ్యంగా రైతులు వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, త్రాగునీరు--సాగునీటి సమస్యలు, అభివృద్ధి పనుల నిర్లక్ష్యం వంటి అంశాలపై ఆయన స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు.వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాను అన్ని కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. రైతులు కుటుంబాలతో సహా కొనుగోలు కేంద్రాల వద్ద పడుతున్న తిప్పలు స్వయంగా చూసి చెల్లించిపోయానని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనికి పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని తాను అధికారులను పలుమార్లు కలిసి వెంటనే వడ్ల కొనుగోలు ప్రారంభించాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ప్రైవేట్ గోదాములు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.చౌటుప్పల్లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ గోదాం కూడా తమ పోరాట ఫలితమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు.త్రాగునీరు, సాగునీరు, రైతు సమస్యలు, ఇలా ప్రతి అంశంలోను స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.తాము అధికారంలో ఉన్న సమయంలో మునుగోడు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు.కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి ఉన్నా కూడా వాటిని ప్రజలకు ఉపయోగపడేలా ముందుకు తీసుకువెళ్లే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదు అని విమర్శించారు.షాడో ఎమ్మెల్యేలే అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనిప్రతి మండలానికి ఒక "షాడో ఎమ్మెల్యే"ని ఏర్పాటు చేసి వాళ్లే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రభాకర్ రెడ్డి గారు ఆరోపించారు.అసలు ఎన్నికైన ఎమ్మెల్యే ప్రజల మధ్య లేకపోతే ఆయన ఎన్నికై ఏం లాభం అని ప్రశ్నించారు.స్థానిక ఎమ్మెల్యే ఇచ్చే హామీలపై ప్రజలు నమ్మకం కోల్పోయారని నేతి బీరకాయలో నెయ్యిలా ఎమ్మెల్యే చెప్పే మాటలు తయారయ్యాయని ఎద్దేవా చేశారు.ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఎమ్మెల్యే మాత్రం 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తాం అంటూ చెప్తున్నారని కనీసం వచ్చే విద్యా సంవత్సరానికైనా పనులు మొదలు పెడతారా అంటూ ప్రశ్నించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని చౌటుప్పల్ ప్రాంతానికి 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించి 80 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే మిగిలిన 20 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా పెండింగ్లో పెట్టారని మండిపడ్డారు.గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, రైతు అవసరాలపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోందని గ్రామాల అభివృద్ధిని పక్కనబెట్టి కేవలం ప్రచార రాజకీయాలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. పదవిలో లేకున్నా ప్రజల కోసం తన పోరాటం ఆగదనిరైతులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజల సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.మునుగోడు ప్రజల హక్కుల కోసం ఎప్పటికీ అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు ఈ విలేకరుల సమావేశంలో చండూరు మున్సిపల్ కౌన్సిలర్ తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్ టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కొత్త పార్టీ సతీష్ మొదలైన వారు పాల్గొన్నారు

# సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ 14వ వార్షికోత్సవ వేడుకలు

**చౌటుప్పల్ మే 28 (న్యూస్ వార్)**

స్థానిక జయశ్రీ ఫంక్షన్ హాల్ లో సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా 14వ వార్షికోత్సవ వేడుకల్లో వైభవంగా జరిగాయి ఈ కార్యక్రమంలో గౌరీశ ఫౌండేషన్ ఫౌండర్స్ శ్రీ కర్నాటి అనిల్ స్వప్న హైదరాబాద్ వారి సహాయార్థంతో చౌటుప్పల్ మండల పరిసరాల్లో ఉన్న కండరాల క్షీణిత వెన్నుముక తీవ్ర వైకల్యం కలిగిన 45 మంది దివ్యాంగుల బాధితులకు ఒక్కొక్కరికి 2000 రూ. చొప్పున విలువైన నిత్యవసర సరుకులు ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక సీఐ మన్మధ కుమార్ చౌటుప్పల్ గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణ కత్తుల మాట్లాడుతూ 14 ఏళ్ల సేవా కార్యక్రమాలు తన బాధ్యతను మరింత పెంచాయని తోటి బాధితులకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని మనసున్న దాతలు లేకపోతే నేను లేనని వాళ్ల సహాయ సహకారాలు ఉండబట్టే సేవా కార్యక్రమాలు చేయగలుగుతున్నాను వాళ్లే నా దేవుళ్ళు అని అన్నారు అలాగే



బాధితుల స్థితిగతులు వివరించారు దివ్యాంగులను కించపరిచిన అవమానపరిచిన 92 సెక్షన్ ప్రకారం చట్టరీత్య చర్యలు తీసుకోవాలని సిఐ గారిని కోరడం జరిగింది సీఐ గారు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమానికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని గతంలో బిజీ షెడ్యూల్ వల్ల ఇలాంటి కార్యక్రమానికి రాలేకపోయినందుకు బాధపడుతున్నానని అన్నారు. అలాగే తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మరియు సైబర్ క్రైమ్ దృష్టిలో పెట్టుకొని మీరందరూ కూడా అప్రమత్తంగా ఉండాలి అని చెప్పడం జరిగింది దివ్యాంగుల సమస్యలు తన దృష్టికి వస్తే ఖచ్చితంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పి యాదయ్య ప్రతిభ ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రకాష్ తండ, మహేష్, దివ్యాంగులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# కేరళ మాజీ సీఎం ఇంటిపై ఈడి దాడులకు నిరసన.

**చౌటుప్పల్ మే 28 (న్యూస్ వార్ )**

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు వినరయి విజయన్ ఇండ్లపై ఈ డి చేపట్టిన దాడులకు నిరసనగా చౌటుప్పల్ సిపిఎం పార్టీ మండల మరియు మున్సిపల్ కమిటీ చౌటుప్పల్ హైవే రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసినా సొంత ఇల్లు కూడ లేని, పదవికి రాజీనామా చేసి, కిరాయి ఇంట్లో ఉన్నటువంటి మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్ ఇంటిపై ఈడి దాడులు చేయడం విడ్డూరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలపై ఈడి దాడులు జరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను, ప్రశ్నించే మీడియాను కూడ సహించలేని స్థితిలో బిజెపి ప్రభుత్వం ఉందని విమర్శించారు. కమ్యూనిస్టులకు నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలను వడ్డీ నటువంటి చరిత్ర, స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వాళ్లతోటి పోరాడిన చరిత్ర ఉందని నేడు ఈడి దాడులకు భయపడి ప్రశ్నించే హక్కును కోల్పోమని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, సిపిఎం నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, చీర్క సంజీవరెడ్డి, ఆకుల ధర్మయ్య, బోయ యాదయ్య, అంతటి అశోక్, తూర్పునూరు మల్లేష్, చికురు ఈదయ్య, మొదలైన వారు పాల్గొన్నారు



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,